క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: మంగళ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ చింతపల్లిగూడ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లను తాకే చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చింతపల్లిగూడ గ్రామ గృహ వినియోగదారులకు, పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గీత కార్మికులకు బీమాపై హర్షం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గీతకార్మికులు

కడ్తాల్: గీత కార్మికుల బీమాను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో గీత కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జంగయ్యగౌడ్, సర్పంచ్ భారతమ్మ, నర్సింహగౌడ్, సాబేర్, అనిల్, లాలయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, భూపాల్, శంకరయ్య, గోపాల్, సత్తయ్య ఉన్నారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత


క్రికెట్ కిట్ అందజేస్తున్న వినోద్‌కుమార్

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్ గ్రామ యువకులకు, గ్రామ ఉపసర్పంచ్ వినోద్‌కుమార్ గురువారం క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు, క్రీడలు, సమాజ సేవపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు మహేశ్, యువకులు వెంకటేశ్, సాయి, శ్రీను, నవీన్, రమేశ్, సాయి, శివ, చరణ్,రఫిక్, సల్మాన్ ఉన్నారు.

మహేశ్వరం.. అభివృద్ధిలో టాప్

కందుకూరు: సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో రూ.3587.51 కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో ఆర్‌అండ్‌బీ రూ.431.64 కోట్లు, పీఆర్ నుంచి రూ.213.71 కోట్లు, రైతుబంధు, బీమా, కల్యాణలక్ష్మి, సీఎం ఆర్ఎఫ్, గొర్రెలు పంపిణీ, కేసీఆర్ కిట్లు, దళితబంధు తదితర పథకాలకు గాను రూ.2942.16 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. టీఎస్ ఐపాస్ నుంచి రూ.9620.88 కోట్లు నిధులు పెట్టుబడితో కంపెనీల స్థాపన జరిగిందన్నారు. మంత్రి సబితారెడ్డి కృషితోనే ఇదంతా సాధ్యమైయిందని కొనియాడారు. అలాగే, జిల్లా పరిషత్ నుంచి మండలానికి 95 పనులకు గాను రూ.4.40 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేయించామన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ ప్రసక్తేలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో బీఆర్‌ఎస్ నేతలు

యాచారం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరి ధాన్యం క్వింటాల్‌కు ఏ-గ్రేడ్ రూ. 2060, బీ గ్రేడ్ రూ.2,040గా ప్రభుత్వం ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, రైతులకు అవసరమైన బస్తాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ జ్యోతినాయక్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు జోగిరెడ్డి, మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్, నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు..

తలకొండపల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సింగిల్‌విండో వైస్ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్‌తో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. ఏ-గ్రేడ్ ధాన్యం ధర రూ.2060, బి-గ్రేడ్ ధాన్యం ధర రూ.2040 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యదర్శి శరత్ కుమార్, శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు విజయ్‌కుమార్, శ్రీరామ్, చంద్రయ్య, జంగయ్య, పెంటయ్య, నర్సిరెడ్డి, నాగేష్, శ్రీను, రవి, అంజి, శ్రీనివాసురెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

ఇబ్రహీంపట్నం: సృజనాత్మతను పెంపొందించుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని గీతం యూనివర్సిటీ డీన్, ప్రొ.మంజునాథచారి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లో గల సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై అంతర్జాతీయ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన చారి మాట్లాడుతూ.. నేటి పోటీ సమాజంలో విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. కళాశాల చైర్మన్ నాగయ్య, కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, కన్వీనర్ డా.సుబ్బారావు, అంజయ్, పీసీ రావు, కిష్టయ్య పాల్గొన్నారు. కాగా మోడల్ కంప్యూటింగ్ ఇన్ సర్క్యూట్ సిస్టమ్‌లో పరిశోధన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఈ సందర్భంగా అందజేశారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

రూ.50లక్షల పరిహారం ఇవ్వాలి


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు

ఆస్పత్రి ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలు.. తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి(25) కడుపు నొప్పి రావడంతో ఈనెల 2న ఆమనగల్లులోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్సకోసం వచ్చాడు. నరేశ్‌రెడ్డికి పరీక్షలు నిర్వహించిన అనంతరం అపెండెక్స్‌గా గుర్తించి ఆస్పత్రిలోనే ఆపరేషన్ చేశారు. అయితే సాయంత్రానికి నరేశ్‌రెడ్డి ఆరోగ్యపరిస్థితి బాగాలేకపోవడంతో ఆస్పత్రి నిర్వాహకులు ఆమనగల్లు నుంచి హైదరాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున నరేశ్‌రెడ్డి మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, రాంపూర్ గ్రామస్తులు గురువారం మృతదేహంతో ఆమనగల్లులోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు అందించాలని, ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. చివరకు పోలీసులు సర్దిచెప్పి ఆందోళన విరమింపచేయించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి తండ్రి అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య తెలిపారు.


నరేశ్‌రెడ్డి (ఫైల్)

దళితబంధు అవినీతిపై నిగ్గుతేల్చాలి


యాచారం: నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

యాచారం: దళితబంధు పథకంలో అవినీతి, అక్రమాలపై కేసీఆర్ సర్కార్ నిగ్గు తేల్చాలని.. లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూల్ చేసిన నాయకులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుగంటి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యాచారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితబంధు పథకంలో అవనీతి, అక్రమాలు జరిగాయని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటించడం సంతోషమే కానీ, వారి పేర్లు బయటపెట్టకపోవడం సరైంది కాదని అన్నారు. దళితబంధు పథకాన్ని ప్రాధాన్యత కింద గ్రామాల్లో ఎస్సీ కుటుంబాల్లోని నిరుపేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకిస్తే సహించేది లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోపు దళిత కుటుంబాలన్నింటికి దళితబంధు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మహేష్, అనంద్, యాదయ్య, మహేందర్, అనంద్, వినోద్, వంశీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ బహిరంగ సభ

తుర్కయంజాల్: బీజేపీ కో హఠావ్-దేశ్‌కో బచావో అనే నినాదంతో ఇంటింటికి సీపీఐ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, శనివారం సుందరయ్య కాలనీలో నిర్వహించే పాదయాత్ర ముగింపు సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గంగాభవానీ కాలనీలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, సుప్రభాతం, ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఆంజనేయ హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు సాయికుమార్, బాల్‌లింగం, సుధాకర్, సత్తయ్య, శివ, ఎల్లయ్య, గిరి, మురళీధర్, పెద్దయ్య, పరమేశ్, సాయిలు, ప్రసాద్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు పాపిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లో గల శ్రీ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి గురువారం ఆలయ ఫౌండర్, ఆలయ ప్రధాన అర్చకుడు రామారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయ నిర్మాణానికి దాతలు సహకరించగలరని రామారావు కోరారు.

భట్టిని కలిసిన శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కను ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ గురువారం కలిశారు. నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఈనెల 6,7 తేదీల్లో భట్టి విక్రమార్క చేపట్టనున్న పాదయాత్రపై ఇరువురు చర్చించారు. 6న పాదయాత్రతో బాట సింగారం నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చి భట్టి బస చేస్తారని, 7న పెద్దంబర్‌పేట, హయత్‌నగర్ మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని శేఖర్‌గౌడ్ తెలిపారు.

కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు

తుర్కయంజాల్: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ధరణి కుమార్ అన్నారు. గురువారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ 14వ వార్డులో కౌన్సిలర్ బొక్క రవీందర్‌రెడ్డితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది నర్సింహ, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పేటలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని సర్పంచ్ హైమావతి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాము, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, రఘురాములు, ఏఎన్ఎం సునీత, ఎంపీటీసీ సరిత, గణేషుగుప్తా, పాండురంగయ్య, విష్ణు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


తుర్కయంజాల్: కంటి పరీక్షలు చేయించుకుంటున్న వైస్ చైర్‌పర్సన్ హరిత

'నా పరువుకు భంగం కలిగించారు'

ఆమనగల్లు: మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామానికి చెందిన గౌని నర్సింహగౌడ్‌పై నిరాధార వార్తలు ప్రచురించిన నాలుగు దినపత్రికల విలేకరులు, ఎడిటర్లపై కేసు నమోదైంది. నర్సింహాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అవురుపల్లి గ్రామంలోని సర్వే నెం.244లో తాను భూమి కొనుగోలు చేయగా.. మార్చి 1, 2 తేదీలలో నాలుగు దినపత్రికలలో తాను అక్రమంగా పట్టా చేసుకున్నట్లు, ఆక్రమించినట్లు వార్తలు ప్రచురించారని నర్సింహాగౌడ్ తెలిపారు. నిరాధార, అసత్య కథనాలు ప్రచురించి తన పరువుకు భంగం కలిగించారని, తీవ్ర మనస్తాపానికి గురి చేశారని పేర్కొన్నారు. దీంతో ఆమనగల్లులోని న్యాయస్థానంలో ప్రైవేటు కేసు వేసినట్లు తెలిపారు. విలేకరులు మహేందర్, చంద్రమౌళి, నర్సింహా, వెంకటేశ్‌లతో పాటు ఆయా దినపత్రికల ఎడిటర్లపై కేసు నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం మాడ్గుల ఎస్‌హెచ్‌ఓకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో బుధవారం 8 మందిపై కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారానికి 19వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, జీతభత్యాలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్లపైకి వచ్చి సమ్మెబాట పట్టిన వీఓఏలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు రజని, పద్మ, శశికళ, కల్పన, ఝాన్సీ, బాలమణి, మంజుల, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

కార్మిక హక్కులను కాలరాస్తున్నారు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

మహేశ్వరం: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. గురువారం మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు కార్మిక అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. కార్మిక యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారన్నారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని ఆరోపించారు. మేడే అమరవీరుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం బలిస్తున్నారన్నారు. మేడే స్ఫూర్తితో కార్మికవర్గం పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఐక్యతతోనే హక్కులను సాధించుకుందామన్నారు. అంతకుముందు కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి తిరు కల్యాణోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరు కల్యాణోత్సవం ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ సంజయ్ గోపాల్‌సైంచర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త యాదగిరి ముదిరాజ్, భక్తులు పాల్గొన్నారు.

నిజమైన 'సేవే'నా?

- అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాల పేరిట కాలనీల్లో వసూళ్లు
- ఈ సంస్థలు అసలువా, నకిలీవా తెలియక ప్రజల అయోమయం

వనస్థలిపురం: అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, వైద్యం కోసం అంటూ కొందరు కాలనీల్లో డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. పలు సంస్థలు తమ సిబ్బందిని రంగంలోకి దించి యథేచ్ఛగా కాలనీల్లో చందాలు వసూలు చేయిస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు.. రాత్రి వరకు ఆటోలకు బ్యానర్లు కట్టుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. అయితే వీటిలో నిజంగా సేవ చేసే సంస్థలు ఏవి, వసూళ్లకు పాల్పడే నకిలీ సంస్థలు ఏవో తెల్సుకోలేక కాలనీల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

అనాథలు, వృద్ధుల కోసమంటూ..

పేదవారు, ఎవరు లేని అనాథలు, వృద్ధుల కోసం చీరలు, ప్యాంట్లు వంటి పాత బట్టలు, బియ్యం, ధన సహాయం చేయాలంటూ ఇటీవల కాలంలో పలు సంస్థల ప్రతినిధులు కాలనీల్లో తచ్చాడుతున్నారు. రోడ్డున పోయేవారిని, ప్రతి ఇంటికీ తిరుగుతు సేవా కార్యక్రమాల పేరిట చందాలు వసూలు చేస్తున్నారు. పలు చోట్ల ఆటోల్లో తిరుగుతూ వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు. సేవా కార్యక్రమాలకు డబ్బులు ఇస్తే పుణ్యం వస్తుందని చాలా మంది వీరికి తోచినంత ఆర్థిక సాయం, బట్టలు, బియ్యం వంటివి విరాళంగా అందజేస్తున్నారు. అయితే తాము అందజేసిన వస్తువులు, డబ్బులు నిజంగా సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతున్నాయా, లేక స్వార్థపరుల చేతుల్లోకి వెళ్తున్నాయా అనే సందేహం చాలా మందికి కలుగుతోంది. అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు నడుపుతున్నామని చెపుతున్న వ్యక్తులకు ఇలా ఇళ్లు, వాడలు తిరుగుతు భిక్షాటన చేయడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తుందా అని వారు ప్రశ్నిస్తున్నారు. పలువురు తాము సేకరించిన దుస్తులు, బియ్యం తదితర సామగ్రిని బయట అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారనే అనుమానాలను కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

గుళ్లు, ఆవుల పేరుతో వసూళ్లు...

పలు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు సాయిబాబా ఫొటోలు పెట్టుకుని ఎక్కడో గుడి కడుతున్నామంటూ వాహనాలపై తిరుగుతూ చందాలు వసూలు చేయడం సర్వసాధారణమై పోయింది. అంతేకాకుండా కొందరు ఆవులను ఆలయాల వద్ద, కాలనీల్లో తిప్పుతూ భిక్షాటన చేస్తున్నారు. భిక్షాటన పేరుతో కాలనీల్లో ఇళ్లను పరిశీలించి వెళ్తున్నారని కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలా విచ్చలవిడిగా అపరిచితులు కాలనీల్లో తిరగడం ఆందోళన కలిగిస్తోందని, ఈ విషయంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.


ఓ సంస్థ బ్యానర్లతో కాలనీల్లో తిరుగుతున్న ఆటో

చందాల వసూళ్లు, భిక్షాటనపై నియంత్రణ ఉండాలి

ఛారిటీ సంస్థల పేరుతో పలువురు కాలనీల్లో తిరుగుతూ డబ్బులు, బియ్యం, దుస్తులు, ఆహార సామగ్రి సేకరిస్తున్నారు. అందులో అసలు ఎవరో, నకిలీలు ఎవరో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంలో పోలీసు, మున్సిపల్ అధికారులు, సంస్థలను రిజిస్ట్రేషన్ చేసే శాఖ అధికారులు గానీ తగిన చర్యలు తీసుకోవాలి. భిక్షాటన ద్వారా వసూళ్లకు పాల్పడే సంస్థలను నియంత్రించాలి.



–నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

ఏడోరోజుకు చేరుకున్న జేపీఎస్‌ల సమ్మె

ఇబ్రహీంపట్నం: జూనియర్, ఔట్ సోర్సింగ్ గ్రామ కార్యదర్శుల సమ్మె గురువారం ఏడోరోజుకు చేరుకుంది. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా కార్యదర్శులు ముగ్గులేసి వినూత్నంగా నిరసనను తెలిపారు. యూటీఎఫ్ నాయకుడు గాలయ్యతో పాటు పలు సంఘాల నేతలు ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు రవికుమార్‌రెడ్డి, సాయికుమార్, అనిల్‌కుమార్, సంపత్, వెంకట్, వినోద్‌కుమార్, రవిందర్, రూషిక, రాధ, లత, శిరీష, సందీప్, శివకుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

కడ్తాల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ నేత ఆచారి డిమాండ్ చేశారు. జేపీఎస్‌లను రెగ్యూలరైజ్ చేయాలని టీపీఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కందుకూర్ డివిజన్ పరిధిలోని కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మండలాల జూనియర్ ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సమ్మెకు బీజేపీ నేత ఆచారి సంఘీబావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, సుగుణ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు సంఘీబావం తెలిపారు.


ఇబ్రహీంపట్నం: ముగ్గులేసి నిరసన తెలుపుతున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా...

జూనియర్ పంచాయతీ ఔట్‌సోర్సింగ్ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు సులోచన, హరిచంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి శశిధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌ల సమస్యలకు త్వరలో పరిష్కారం..

కడ్తాల్: మండల కేంద్రంలో డివిజన్ స్థాయిలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి గురువారం సందర్శించారు. సీఎం కేసీఆర్ జేపీఎస్‌ల సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరిచంద్‌నాయక్, టీపీఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావీద్ ఉన్నారు.